సాక్షి కామారెడ్డి

శనివారం । 18 । జనవరి । 2025



గుప్త నిధుల కోసం..
లింగంపేట మండలంలోని పలు ప్రాంతాల లో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు సాగించారు.
- IIలో ▸



ఆరోగ్యం వైపు అడుగులు
ప్రజలలో ఆరోగ్యంపై స్పృహ పెరుగుతోంది. దీంతో రోజూ వాకింగ్‌తో పాటు యోగా, వ్యాయామాలు చేస్తున్నారు.
- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /15.1

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

న్యూస్‌రీల్

'ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి'



తాడ్వాయి: ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఆధార్ సీడింగ్‌ను త్వరగా పూర్తిచేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. ఆయన శుక్రవారం తాడ్వాయిలోని ఉపాధి హామీ కార్యలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 20 రోజుల కంటే ఎక్కువగా పనిచేసిన రైతు కూలీల వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఇన్‌చార్జి ఏపీవో కృష్ణ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

20 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం 15వ తేదీతో పంపిణీ ముగియాల్సి ఉంది. కానీ ఈ నెలలో సంక్రాంతి సెలవులు రావడం, కొన్ని గ్రామాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం ఆలస్యంగా చేరడంతో పంపిణీ గడువును ఈ నెల 20 వరకు పొడిగిస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది.

20న జాబ్ మేళా

బిచ్కుంద: మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీసీ ఫుడ్ డివిజన్ హైదరాబాద్, ఎల్అండ్‌టీ, వరుణ్ మోటర్స్, మహీంద్రా మోటార్స్ తదితర కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 20న ఎస్సెస్సీ, ఐటీఐ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, అప్రెంటిస్ రిజిస్ట్రేషన్ జిరాక్స్ కాపీలు తీసుకుని కళాశాలకు రావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాయుసేనలో ఉద్యోగాలకు..

కామారెడ్డి అర్బన్: వాయుసేనలో గ్రూప్–వై (మెడికల్ అసిస్టెంట్) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కేఎస్ జగన్నాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు, చరిత్ర గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22న ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల సామగ్రి సరఫరాకు..

కామారెడ్డి అర్బన్: జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు అవసరమైన ఎన్నికల సామగ్రి సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటలలోపు టెండర్లు వేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో గాని, 73062 45710 నంబర్‌లో గాని సంప్రదించాలని సూచించారు.

ఉచిత శిక్షణకు..

డిచ్‌పల్లి : డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 9 నుంచి ఎలక్ట్రీషియన్ (30 రోజులు), సీసీ టీవీ (13 రోజులు) కోర్సుల్లో శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19–40 ఏళ్ల యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలు తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం పూర్తిగా ఉచితంగా అందజేస్తారన్నారు. వివరాలకు 08461– 295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రహదారిపై రక్తచారికలు!

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో ప్రతినెలా 20 మందికిపైనే మృత్యువాత పడుతున్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అతివేగం, అజాగ్రత్త, మద్యం సేవించి వాహనాలు నడపడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- ప్రతినెలా 20 మందికిపైనే మృత్యువాత
- అవగాహన కల్పిస్తున్నా మారని వాహనదారులు
- అతివేగం, నిర్లక్ష్యంతో అనర్థాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో మూడు జాతీయ రహదారులకు తోడు స్టేట్ హైవేలు, జిల్లా రహదారులపై నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. రహదారులు రక్తసిక్తమవుతూనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలలో ప్రతినెలా కనీసం ఇరవై మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 258 మంది చనిపోగా, 255 మంది క్షతగాత్రులయ్యారు. 2023 సంవత్సరంలో 230 మంది మృత్యువాతపడగా.. 271 మంది గాయాలపాలయ్యారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు తగ్గడం లేదు.

ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా..

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్రవాహనదారులే చనిపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనులకు వెళ్లేందుకు అనువుగా ఉంటుందని చాలా మంది మోపెడ్‌లు కొనుగోలు చేస్తున్నారు. తక్కువ వెయిట్ ఉన్న వాహనాలు కావడంతో చిన్నగా ఎక్స్‌లేటర్ తిప్పినా అవి దూసుకుపోతుంటాయి. దీనికి తోడు డ్రైవింగ్ సరిగా రాక, ట్రాఫిక్ నిబంధనలు తెలియకపోవడంతో చాలా మంది ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా మోపెడ్‌లపై వెళ్లేవారే చనిపోతున్నట్లు తెలుస్తోంది. కొన్ని సంఘటనల్లో లారీలు, టిప్పర్లు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. అన్ని రహదారులపై వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. సిరిసిల్ల నుంచి మాచారెడ్డి, కామారెడ్డి మీదుగా ఎల్లారెడ్డి వరకు ఉన్న కేకేవై రోడ్డుపై ట్రాఫిక్ గతంలో కన్నా రెట్టింపైంది. ఈ రహదారిపై చాలా చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. హైవేల మీద రాంగ్ రూట్‌లో రావడం, వేగంగా వెళ్తూ ఆగి ఉన్న వాహనాలను వెనక వైపు నుంచి ఢీకొనడంతోనూ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

అన్ని రోడ్లపై ప్రమాదాలు..

జిల్లాలో బస్వాపూర్ నుంచి దగ్గి వరకు భిక్కనూరు, కామారెడ్డి, సదాశివనగర్ మండలాల మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారిపై గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 57 మంది చనిపోయారు. అలాగే నిజాంసాగర్, పిట్లం, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, మద్నూర్ మండలాల మీదుగా వెళ్లే 161వ నంబరు జాతీయ రహదారిపై గతేడాది జరిగిన యాక్సిడెంట్లలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, మహ్మద్‌నగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల మీదుగా వెళ్లే 765(డి) నంబరు జాతీయ రహదారిపై గతేడాది జరిగిన ప్రమాదాలలో 25 మంది మృత్యువాతపడ్డారు. ఇందులో ఎక్కువగా నస్రుల్లాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. మాచారెడ్డి, పల్వంచ, కామారెడ్డి, తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల మీదుగా వెళ్లే 11వ నంబరు రాష్ట్రీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 35 మంది చనిపోయారు. గ్రామీణ రహదారులపై 51 మంది, జిల్లా రహదారులపై 64 మంది చనిపోయినట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. చాలా సంఘటనల్లో హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు పోతున్నాయి. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెబుతున్నాం. తమపై కుటుంబం ఆధారపడి ఉందన్న విషయాన్ని మనసులో పెట్టుకుని మెదలాలి. రోజూ వాహనాలను తనిఖీ చేస్తూ జరిమానాలు విధిస్తున్నా కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్ సేఫ్టీ బృందాలు రోడ్లపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వాటిని సరి చేస్తున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటాం.

–సింధుశర్మ, ఎస్పీ, కామారెడ్డి

జోరుగా వ్యవసాయ భూముల సర్వే

'రైతుభరోసా' అర్హులను తేల్చేందుకు.. ■ జిల్లాలో 104 బృందాల ఏర్పాటు

ఎల్లారెడ్డి : ఎన్నోరోజులుగా రైతులను ఊరిస్తూ వస్తున్న రైతుభరోసా పథకం అమలుకు రాష్ట్రప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈనెల 26నుంచి పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గతంలోలాగా కాకుండా సాగు భూములకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. దీంతో సర్కారు ఆదేశాల మేరకు వ్యవసాయానికి అనువైన భూములను గుర్తించేందుకు అధికారులు సర్వే చేపట్టారు. సర్వే గురువారం ప్రారంభమైంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగుకు యోగ్యమైన భూములను గుర్తిస్తున్నారు. వ్యవసాయానికి అనువు కాని వెంచర్లు, గోదాములు, రోడ్లు, రాళ్ల రప్పలు, గుట్టలతో నిండిన సాగుకు పనికి రాని భూములు, నివాస ప్రాంతాలను రైతు భరోసా నుంచి మినహాయించేందుకు అధికారులు పకడ్బందీ సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలో సేద్యానికి పనికి రాని భూములను గుర్తించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) క్లస్టర్ల వారీగా 104 బృందాలను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ బృందంలో మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి గ్రామ స్థాయిలో ఏఈవోతో పాటు, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సభ్యుడిగా ఉన్నారు. వీరు సర్వే నంబర్ల వారీగా భూములను పరిశీలిస్తూ వ్యవసాయానికి అనువైన, అనువుకాని భూములను గుర్తిస్తున్నారు. జిల్లాలో గతంలో 5,24,460 ఎకరాలకు రైతుబంధు పథకం వర్తించింది. అయితే సర్వేలో అధికారులు పంటలు వేసిన భూములే కాకుండా నీటి సదుపాయం లేని కారణంగా పంటలు వేయని భూములను కూడా సేద్యానికి అనువైనవిగానే గుర్తించాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. ఈ భూముల్లో ఈ సీజన్‌లో పంటలు వేయకపోయినా రైతు భరోసా అందే అవకాశాలున్నాయి. వెంచర్లు, నివాస ప్రాంతాలు, కోళ్లఫాంలు, గోదాములులాంటి పారిశ్రామిక అవసరాల కోసం ఉపయోగిస్తున్న భూములు, రాళ్ల రప్పలతో నిండిన బంజరు భూములు లాంటి సేద్యానికి పనికిరాని భూములను మాత్రం మినహాయించనున్నారు. సర్వే పూర్తయ్యాక ఇందులోనుంచి సుమారు 40 వేల ఎకరాలకు రైతుభరోసా దక్కకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

21 నుంచి గ్రామ సభలు

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సర్వే పూర్తయిన అనంతరం అధికారులు ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ పంచాయితీల వారీగా గ్రామ సభలు నిర్వహించి వ్యవసాయానికి అనువు కానివి అని గుర్తించిన భూముల వివరాలు బహిరంగంగా ప్రజలకు తెలియజేయాల్సి ఉంటుంది. గ్రామసభల అనంతరం 25న రైతు భరోసాకు అర్హత కలిగిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ప్రకారం ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తారని తెలుస్తోంది.



ఎల్లారెడ్డిలో రైతు భరోసా సర్వే చేస్తున్న అధికారులు

'జాతీయ స్థాయికి ఎదగాలి'



ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ అర్చరీ పోటీలు ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

దోమకొండ : జిల్లా, రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో రాణించి, జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని జిల్లా అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కామినేని అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తిరుమలగౌడ్ క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం దోమకొండ గడికోటలో ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ అర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

కార్యక్రమంలో అర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, సలహాదారు రాంచంద్రం, కోచ్ ప్రతాప్ దాస్, బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారం మధు, నాయకులు కడారి రమేష్, బుర్రి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబానికి ప్రశంస పత్రం

భిక్కనూరు: అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబానికి జీవన్‌దాన్ ట్రస్టు ప్రశంసపత్రాన్ని శుక్రవారం అందజేసింది. వివరాలిలా ఉన్నాయి. తిప్పాపూర్‌కు చెందిన కడర్ల నడిపోల్ల బాలమల్లు గతనెల 12న ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 14న మృతిచెందాడు. జీవన్‌దాన్ ట్రస్టు ప్రతినిధులు మృతుడి కుటుంబ సభ్యులను కలిసి అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు సమ్మతి తెలిపారు. శుక్రవారం జీవన్‌దాన్ ట్రస్టు ప్రతినిధి శివకుమార్ గ్రామానికి వచ్చి బాలమల్లు భార్య అంజమ్మను సన్మానించి ఆమెకు ప్రశంస పత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుంట లింగారెడ్డి, భీంరెడ్డి, స్వామి, వెంకటరెడ్డి, రాజశేఖరరెడ్డి, నర్సింలు, బాబు, సిద్దరాములు పాల్గొన్నారు.



అంజమ్మను సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

'1,060 ఎకరాల వ్యవసాయేతర భూమి గుర్తింపు'

నాగిరెడ్డిపేట: జిల్లాలో ఇప్పటివరకు 1,060 ఎకరాల వ్యవసాయేతర భూమిని గుర్తించామని అడిషనల్ కలెక్టర్ విక్టర్ తెలిపారు. శుక్రవారం ఆయన ధర్మారెడ్డి గ్రామశివారులో రైతుభరోసా సర్వేను పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టి సాగులో లేని భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నాగిరెడ్డిపేట మండలంలో ఇప్పటివరకు 20 ఎకరాల వ్యవసాయేతర భూమిని గుర్తించారన్నారు. గ్రామసభల్లో వ్యవసాయేతర భూములపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ముందుగా వచ్చిన జాబితా ప్రకారం గ్రామాల్లో రేషన్‌కార్డు సర్వే కొనసాగుతుందన్నారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకర్‌చారి ఉన్నారు.

శెట్పల్లి సంగారెడ్డిలో..

లింగంపేట: రైతు భరోసా సర్వేను రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. శుక్రవారం ఆయన శెట్పల్లిసంగారెడ్డిలో రైతు భరోసా సర్వేను పరిశీలించారు. సర్వేలో తప్పులు లేకుండా జాగ్రత్తగా వివరాలు సేకరించాలని ఆదేశించారు. వెంచర్లు, కట్టడాలు, కోళ్ల ఫారాలు, భవన నిర్మాణాలు, వ్యవసాయేతర భూములను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఉపతహసీల్దార్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

సదాశివనగర్: సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్వేను ఆయన పరిశీలించారు. గతంలో సాగు చేసిన పంట వివరాలు, ప్రస్తుతం సాగుకు యోగ్యంగా లేకపోవడానికి కారణాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చందర్ నాయక్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఏడీవో రత్న, ఏవో ప్రజాపతి, ఏఈవో కవిత తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

పిట్లం: పిట్లం, చిన్నకొడప్‌గల్‌లలో శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, మండల వ్యవసాయ అధికారి కమల, ఆర్ఐ శీతల్, ఏఈవో వీణ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మండలంలో..

మద్నూర్: అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం లచ్చన్, అంతాపూర్‌లలో పర్యటించి, రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ముజీబ్, ఏవో రాజు, సర్వే అధికారులున్నారు.



ధర్మారెడ్డి శివారులో రైతుభరోసా సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విక్టర్



పిట్లంలో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మహిళా శక్తి!

- ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు
- మెగావాట్ ప్లాంట్‌కు రూ. 3.13 కోట్ల రుణం..
- జిల్లాలో 100 ఎకరాల స్థలం గుర్తింపు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాయి. అవసరమైన స్థలాలను ఎంపిక చేసేందుకు కసరత్తు సాగుతోంది.

నాగిరెడ్డిపేట: మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో రెవెన్యూ, ఐకేపీల ఆధ్వర్యంలో స్థలాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశారు. నాలుగు ఎకరాలకు ఒక మెగావాట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 150 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 100 ఎకరాలను గుర్తించారు. ఇప్పటికే గుర్తించిన స్థలాలను రెండు, మూడు రోజుల్లో మరోసారి జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి తుదినిర్ణయం తీసుకోనున్నారు.



తాండూర్ శివారులో సోలార్ పవర్ ప్లాంట్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పది శాతం చెల్లిస్తే..

ఒక మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు నాలుగెకరాల స్థలం అవసరం అవుతుంది. ఒక మెగావాట్ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు రూ.3.13 కోట్లు ఖర్చవుతాయి. ఇందులో 10 శాతం వాటాధనాన్ని మహిళా సంఘాల సభ్యులు చెల్లించాల్సి ఉంటుంది. మిగతా సొమ్మును ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తుంది. ఒకసారి ఏర్పాటు చేసే సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా సుమారు 25 ఏళ్లపాటు ఆదాయం సమకూరనుందని అధికారులు చెబుతున్నారు. కాగా ప్లాంట్ కోసం తీసుకునే రుణాన్ని 15 ఏళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

సబ్‌స్టేషన్‌కు 5 కి.మీ.ల పరిధిలో..

ప్రస్తుతమున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 5 కి.మీ.ల పరిధిలో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని ప్రభుత్వ, దేవాదాయశాఖ, ఇరిగేషన్ స్థలాలను పరిశీలించి 15 మండలాల్లో 100 ఎకరాల స్థలాలను గుర్తించారు. వాటిని అధికారులు రెండుమూడు రోజుల్లో మరోసారి పరిశీలించనున్నారు. అనంతరం ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉన్న స్థలాలను గుర్తించి గ్రామీణాభివృద్ధి శాఖ, ట్రాన్స్‌కో, రెడ్‌కో ఆధ్వర్యంలో అనుమతులు ఇవ్వనున్నారు.

దగాపడ్డ రైతులు

మోర్తాడ్: పంట పొలాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను అందించడానికి కాళేశ్వరం పథకంలో భాగంగా చేపట్టిన ప్యాకేజీ 21 పనులు సాగకపోవడంతో.. ఈ పథకం కోసం కేటాయించిన పైపులను దళారులు పక్కదారి పట్టించారు. ప్యాకేజీ పనులు పూర్తి చేయడానికి టెండర్ దక్కించుకున్న కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో పోలీసు యంత్రాంగం స్పందించింది. పైపుల రికవరీపై దృష్టి సారించింది.

మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లోని వివిధ గ్రామాల చెరువుల వద్ద ఆరేళ్ల కింద పైపులను వేశారు. ప్యాకేజీ 21కి సంబంధించిన ప్రధాన పైప్‌లైన్ పనులు పూర్తి చేసినా పంట పొలాలకు సాగునీటిని అందించడానికి డిస్ట్రిబ్యూటరీ పైపులు వేయాల్సి ఉంది. ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడానికి పంట పొలాల మధ్య పైప్‌లైన్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.750 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. ఈ మేరకు నిధులను మంజూరు చేయగా టెండర్ ప్రక్రియ ఎప్పుడో పూర్తి అయ్యింది. రైతులు ప్రతి సీజనులో పంటలను సాగు చేస్తూ ఎప్పుడు కూడా వ్యవసాయ క్షేత్రాలకు విరామం ఇవ్వకపోవడంతో ప్యాకేజీ పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. నీటిపారుదల శాఖ అధికారులు చర్చలు జరిపినా ప్యాకేజీ పనులు చేయడానికి కాంట్రాక్టు కంపెనీకి రైతులు సహకరించలేదు. ఫలితంగా డిస్ట్రిబ్యూటరీ పైప్‌లు అలాగే ఉండిపోయాయి. తిమ్మాపూర్ శివారులోని రాంసాగర్ చెరువు, వడ్యాట్‌లోని ఒక చెరువు, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లోని వివిధ గ్రామాలలో నిలువ ఉంచిన పైపులను దళారులు రైతులకు విక్రయించుకున్నారు. ఒక్కో పైప్‌కు రూ.5వేల వరకు వసూలు చేయగా పైప్‌లైన్‌ను పంట పొలాల్లో వేయడానికి ఒక్కో పైప్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేశారు. పైప్‌లు చోరీకి గురవుతున్నా కంపెనీ ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో 1,200 పైప్‌లు మాయం అయ్యాయి. ప్యాకేజీ పైపులు మాయమైన విషయం కంపెనీ యాజమాన్యానికి ఆలస్యంగా తెలిసింది. వెంటనే స్పందించిన కంపెనీ యాజమాన్యం ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. అధికార యంత్రాంగం స్పందించి పోలీసులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు రంగంలోకి దిగారు. వారం, పది రోజుల నుంచి పైపుల రికవరీ సాగుతోంది. ప్యాకేజీ పనుల పైపులు ఎవరు వినియోగించుకున్నా స్వచ్ఛందంగా పోలీసు స్టేషన్‌కు తరలించాలని పోలీసులు సూచిస్తున్నారు.



మోర్తాడ్ పోలీసులు రికవరీ చేసిన పైపులు

క్లుప్తంగా

నాగాపూర్ రెండో లిఫ్టుకు మోటార్ సరఫరా



బాల్కొండ: మండలంలోని నాగాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన రెండో లిఫ్టు కోసం మోటార్‌ను ఇరిగేషన్ శాఖ శుక్రవారం సరఫరా చేసింది. నాగాపూర్ మొదటి లిఫ్టు నిర్మాణం 1062 అడుగుల వద్ద నిర్మించారు. ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గినప్పుడు నీరు అందక పంటలు ఎండిపోవడంతో రెండవ లిఫ్టు కోసం గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కానీ పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. ప్రస్తుతం మోటార్ సరఫరా కావడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మోటార్ మంజూరుకు కృషి చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవద్దు



కమ్మర్‌పల్లి: గూడ్స్ క్యారియర్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి పరిసరాల్లో వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్‌లో ప్రయాణికులను తరలిస్తున్నట్లు గుర్తించి హెచ్చరించారు. వాహన ధ్రువపత్రాలు లేని 5 వాహనాలను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని, వాహన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. యూనిఫాం, బ్యాడ్జి నంబర్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ జాగ్రత్తలు, ప్రమాదాల గురించి వివరించారు.

పరిమిత లోడ్‌తో వెళ్లాలి

ఖలీల్‌వాడి: గూడ్స్‌వాహనంలో పరిమిత లోడ్‌తో వెళ్లాలని ఎంవీఐలు కిరణ్, రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడి, రైల్వేబ్రిడ్జి వద్ద గూడ్స్ వాహనాలు, ఆటో డ్రైవర్లకు శుక్రవారం వారు రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు, పరిమిత సీట్ల మేరకు ప్రయాణికులను తీసుకెళ్లాలని సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



పోస్టర్లను ఆవిష్కరిస్తూ..



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): ఏడాదికి ఒక్కసారైనా యువత రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో జగద్గురు నరేంద్ర మహారాజ్ దోస్త్‌పల్లి ఉప పీఠం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్నప్పుడు రక్తం ఎంతో అవసరమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఉప పీఠం సభ్యులు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్ దేశాయ్ తదితరులున్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంసాగర్(జుక్కల్): ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులు గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో గురుకులాల ప్రవేశ దరఖాస్తుల పోస్టర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురుకులాల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, పరీక్షల ద్వారా సీట్లను సాధించాలని ఆయన సూచించారు.

టమాటా కిలో ఎట్లా ఇస్తున్నావ్ అమ్మా..

మద్నూర్(జుక్కల్): టమాటాలు కిలో ఎట్లా ఇస్తున్నావ్ అమ్మా అంటూ.. మేనూరు సంతలో కూరగాయలు బేరమాడుతూ జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కాసేపు సందడి చేశారు. మేనూర్‌లో శుక్రవారం ప్రధాన రహదారిపై వారాంతపు సంత నిర్వహిస్తారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే తోట కారు దిగి సంతలో కూరగాయలు విక్రయిస్తున్న రైతుల వద్దకు వెళ్లి వాటి ధరలను తెలుసుకున్నారు. ఇక్కడ దొరికే కూరగాయలు తాజాగా ఉంటాయని ఎలాంటి మందులు వాడకుండా పండిస్తున్నామని రైతులు, ఎమ్మెల్యేతో చెప్పారు. ఏమైనా సమస్యలున్నాయా అని కూరగాయల విక్రేతలను అడిగి తెలుసుకున్నారు.



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిలో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా



ఉత్కంఠభరితంగా సాగుతున్న కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

ఎల్లారెడ్డి : క్రీడాపోటీల్లో యువకులు చూపుతున్న ఉత్సాహాన్ని చూసి ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని, ఇందుకోసం సంబంధిత మంత్రితో మాట్లాడుతానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగుతున్న మండలస్థాయి మదనన్న కబడ్డీ పోటీలలో భాగంగా శుక్రవారం రాత్రి ఫైనల్ మ్యాచ్ జరిగింది. మండలస్థాయి పోటీలలో 56 జట్లు పాల్గొనగా హాజీపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఎల్లారెడ్డి జట్టు రెండో స్థానంలో, భిక్కనూర్ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.51వేలు, రెండవ బహుమతిగా రూ.21వేలు, మూడో బహుమతిగా రూ.11వేలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడా పోటీల ముగింపు సందర్భంగా అమెరికా నుంచి ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల మాదిరిగా పోటీలను నిర్వహించడం పట్ల అభినందించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. యువకులలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు ఇలాంటి పోటీలు ఎంతో తోడ్పడతాయని అన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన కుడుముల సత్యం, నిర్వాహకులకు అభినందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, బోరంచ సాయిలు, శామ్యూల్, సంజీవరెడ్డి, షెకావత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు



ఖలీల్‌వాడి: మైనర్లు వాహనాలు నడపొద్దని, వారికి వాహనాలు ఇవ్వవద్దని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. ఒకవేళ ఎవరైనా వారికి వాహనాలు ఇస్తే సంబంధిత వాహనాదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోగల ఓ షాపింగ్‌మాల్‌లో శుక్రవారం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ రైడింగ్, డ్రంకన్‌డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రసాద్, చంద్ర మోహన్, షాపింగ్‌మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటులో తుమ్మల పాత్ర ఏంటీ?

- ప్రొటోకాల్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభివృద్ధిపై దృష్టిసారించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



దినేష్ కులాచారి

సుభాష్‌నగర్: పసుపు బోర్డు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొనడం హాస్యాస్పదమని, బోర్డు ఏర్పాటులో ఆయన పాత్ర ఏంటో ఎమ్మెల్యే భూపతిరెడ్డి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఆహ్వానం లేదని భూపతిరెడ్డి అడుగుతున్నారని, అర్బన్‌లో షబ్బీర్ అలీ, ఆర్మూర్‌లో వినయ్‌రెడ్డి, బాల్కొండలో సునీల్ ఏ హోదాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎంపీ అర్వింద్‌ను పిలవకుండా ఎలా ప్రారంభోత్సవాలు చేశారని ప్రశ్నించారు. ప్రొటోకాల్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. ఎంపీగా కవిత ఉన్న సమయంలో కేంద్రానికి లేఖలు రాయడం వల్లే పసుపు బోర్డు ఏర్పాటైందని బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని, పదేళ్లు అధికారంలో ఉండి బోర్డు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేల గురించి కాంగ్రెస్ నాయకులు పోస్టర్లు అతికించారని, అలాంటి పోస్టర్లు పెట్టాలంటే ముందుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలపైనే పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని దినేష్ హితవుపలికారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, మంజూరు చేసిన నిధుల గురించి శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకుంటే ఫిబ్రవరి 1న దీనిపై తాము చార్జిషీట్ విడుదల చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు 'ఉపాధి నిధులు'

- జిల్లాకు మెటీరియల్ కంపోనెంట్ కింద రూ.31.39 కోట్లు విడుదల
- బాల్కొండ నియోజకవర్గానికి అత్యధికంగా కేటాయింపు

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కంపోనెంట్ కింద అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులను కేటాయించగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలోని బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాలతోపాటు బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో ఉన్న జిల్లా గ్రామాలకు మొత్తంగా రూ.31.39 కోట్లు విడుదల అయ్యాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిధులు విడుదల కావడంతో వచ్చే మార్చి నెలాఖరులోగానే పనులు పూర్తి చేయాల్సి ఉంది.

పరిగణలోకి పనుల విలువ..

గతంలో అన్ని నియోజకవర్గాలకు ఒకే విధంగా నిధులను కేటాయించేవారు. ఈసారి మాత్రం పనుల విలువను పరిగణలోకి తీసుకుని ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో విధంగా నిధులను విడుదల చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో రూ.6.35 కోట్ల విలువ చేసే పనులకు ఆమోదం లభించింది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి రూ.5 కోట్లు, బోధన్ నియోజకవర్గానికి రూ.7.72 కోట్లు, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని గ్రామాలకు రూ.2కోట్లు విడుదల చేశారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనలకు రూ.5.20 కోట్లు, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డి ఇచ్చిన ప్రతిపాదనలకు రూ.5.12 కోట్లు విడుదల అయ్యాయి. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికార పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఇచ్చిన ప్రతిపాదనలకు కూడా నిధులను కేటాయించడం గమనార్హం. బాల్కొండ నియోజకవర్గానికి అత్యధికంగా రూ.10.32 కోట్లు విడుదల కావడం విశేషం. ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు నిర్మించనున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి.

సర్వే నిష్పక్షపాతంగా చేయండి

- అదనపు కలెక్టర్ విక్టర్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

ఎల్లారెడ్డి: రైతు భరోసా అమలు కోసం చేపట్టిన సేద్యపు భూముల సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. శుక్రవారం ఆయన లక్ష్మాపూర్‌లో జరుగుతున్న సర్వే పనులను పర్యవేక్షించారు. సర్వే నంబర్ల ప్రకారం జరుగుతున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు అందజేశారు. సేద్యానికి పనికిరాని భూములను సర్వే నంబర్‌తో సహా కచ్చితంగా గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో ప్రకాష్, ఏఈవో సతీష్ తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన సాయి శివ, పండరి, స్ఫూర్తి

నిజామాబాద్ నాగారం: జాతీయస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ జట్టును ఇటీవల ఎంపిక చేశారు. రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులు సాయి శివ, పండరి, స్ఫూర్తి ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం క్రీడాకారులను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యక్షులు కిషోర్, కిషన్, రంజిత్, నరసయ్య, రాజ్ కుమార్ తదితరులు అభినందించారు.

దోమలను నిర్మూలించడమే లక్ష్యం



డిచ్‌పల్లి: వ్యాధులు ప్రబలకుండా దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నివారణ మందును స్ప్రే చేయించాలని మలేరియా కమిటీ సభ్యుడు రాజేందర్, వైద్య సిబ్బందికి సూచించారు. ఫ్రైడే– డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూపర్ వైజర్ దేవపాలను ఆదేశించారు. ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఖలీల్‌వాడి: ఒకరి మృతికి కారణమైన ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శుక్రవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని ఇందిరపూర్ కాలనీకి చెందిన కలకొండ శ్రీకాంత్ 2020 అక్టోబర్‌లో బోధన్ రోడ్ లో ఓ హోటల్ వద్ద తన బైక్ పార్క్ చేసి, టీ తాగడానికి వెళ్లాడు. ఈసమయంలో అతని బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సీసీఫుటేజీ ద్వారా నిందితులను ఒడ్యాట్‌పల్లికి చెందిన షేక్ ఆసిఫ్, పూలింటి బాబుగా గుర్తించి, వారి ఫోన్ నంబర్లను సంపాదించాడు. తన బైక్ ఇవ్వమని వారిని ఫోన్‌లో కోరగా, బర్ధిపూర్ రోడ్‌లో గల ఈనాడు కార్యాలయం వద్దకు రమ్మన్నారు. శ్రీకాంత్ అతని తండ్రి శాంతయ్య అక్కడికి వెళ్లగా, నిందితులు వారిని తీవ్రంగా గాయపర్చారు. శాంతయ్య గాయాలతో మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఆసిఫ్, బాబులకు శిక్ష విధించారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు..

ఖలీల్‌వాడి/మాక్లూర్: ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మాక్లూర్ మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన గురజాల ప్రవీణ్‌కు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సంవత్సరం పాటు జైలు శిక్ష రూ.2వేల జరిమానాన విధించినట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. ప్రవీణ్ జూలై 27, 2016న అర్ధరాత్రి గుత్ప గ్రామంలోని ఒక మహిళ తన ఇంటిలో నిద్రిస్తున్న వేళలో అక్రమంగా ప్రవేశించి, అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జడ్జి శిక్షను ఖరారు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి..

ఎడపల్లి(బోధన్): ఆలయంలో చోరీ చేసిన నిందితుడికి ఏడాది జైలు శిక్షను బోధన్ కోర్టు విధించినట్లు ఎడపల్లి ఏఎస్సై ఇలియాస్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్ గ్రామంలోని గంగమ్మ గుడిలో జులైలో అదే గ్రామానికి చెందిన జరుపుల రాములు చొరబడి నగదు, బంగారం చోరీ చేశాడు. పోలీసులు అతడిని పట్టుకొని విచారించగా, చోరీని ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.1750 రికవరీ చేసి, కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ జరుగగా నిందితుడికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షను జడ్జి విధించినట్లు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష: 19మందికి జరిమానా

ఖలీల్‌వాడి: డ్రంకన్‌డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్‌జాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందిని ఇటీవల పట్టుకోగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఇందులో కోర్టు 19మందికి రూ. 43500 జరిమానా విధించగా, మిగిలిన ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం పోలీసులు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ప్రభాకర్ అనే వ్యక్తిని పట్టుకుని కోర్టులో హాజరు పర్చారు. అతడికి రెండు రోజుల జైలు శిక్షను శుక్రవారం బోధన్ కోర్టు జడ్జి విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై రామ్ శుక్రవారం తెలిపారు. అలాగే బియ్యం నిల్వ ఉంచిన ఫైజల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తుల ఆందోళన
- ముస్తాపూర్ తండాలో ఘటన



మోహన్ (ఫైల్)





ప్రమాదానికి కారణమైన లారీ, కేకేవై రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా.. ముస్తాపూర్ తండాకు చెందిన సబావత్ మోహన్(29) గురువారం సాయంత్రం మేతకు వెళ్లిన ఆవులను ఇంటికి తీసుకురావడానికి వెళ్లాడు. ముస్తాపూర్ శివారులోని మూల మలుపు వద్ద కామారెడ్డి నుంచి లింగంపేట వైపు వస్తున్న ఇసుక లారీ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మోహన్‌పైకి దూసుకు వచ్చింది. లారీ చక్రాల కింద మోహన్ ఇరుక్కోగా ఈడ్చుకుంటూ రోడ్డు కిందికి వెళ్లింది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారుకాగా, స్థానికులు పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. జేసీబీ సహాయంతో లారీ కింది నుంచి మోహన్‌ను బయటకు తీసి కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి అమ్రియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, బంధువులు, తండావాసులు కేకేవై రోడ్డుపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. దీంతో గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించడంతో ఆందోళన విరమించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు!



తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి, కేశాయిపేట గ్రామాల శివారులో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. కేశాయిపేట గ్రామస్తులు కొందరు శుక్రవారం ఉదయం పంట చేనులకు, బహిర్భూమికి గ్రామ శివారులోకి వెళ్లగా ఒక ప్రదేశంలో పూజలు చేసినట్లు గుర్తించారు. విషయాన్ని గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి రాగా, పూజలు చేసి గుంత తీసి పూడ్చినట్లు ఉండడంతో గుప్త నిధుల కోసం తవ్వినట్లు గుర్తించారు. సదరు స్థలం గ్రామానికి చెందిన గంపల సాయిలుకు చెందినది. గతంలో సాయిలు అదే ప్రదేశంలో బోరు వేయడంతో గుప్తనిధులు కనిపించినట్లు ప్రచారం జరిగింది. అదే సంవత్సరం సాయిలు భార్య అనారోగ్యానికి గురై చనిపోవడంతో గ్రామస్తులు అటువైపు వెళ్లడం మానేశారు. గత మూడు సంవత్సరాల క్రితం కోమట్‌పల్లి అటవీ ప్రాంతంలో పలువురు గుప్త నిధుల కోసం వెతుకుతుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తిరిగి అదే ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు చేసిన విషయం కలకలం రేపింది.

కరెంట్‌షాక్‌తో బాలుడికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని మహబూబ్ కాలనీలో కరెంట్ తీగలకు చిక్కుకున్న గాలిపటాన్ని తీసుకుంటుండగా ఓ బాలుడికి గాయాలు అయినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన షేక్‌జీషాన్(7) ఇంటి దాబాపై ఒంటరిగా గాలిపటం ఎగురవేయగా విద్యుత్ వైర్లకు చిక్కుకుంది. కుర్చీ వేసుకుని తీస్తుండగా కరెంట్‌షాక్ తగిలి గాయాలు అయ్యాయి. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాట స్థావరంపై శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.3,060 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మరొక వ్యక్తి పరారీలో ఉండగా, పట్టుబడినవారిపై కేసు నమోదు చేశామన్నారు.

భీమ్‌గల్ సీఐగా పొన్నం సత్యనారాయణ గౌడ్

ఖలీల్‌వాడి: భీమ్‌గల్ సీఐగా సత్యనారాయణ గౌడ్‌ను నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సత్యనారాయణగౌడ్ రామగుండం సీసీఎస్‌లో పని చేస్తున్నారు. భీమ్‌గల్ సీఐగా పని చేసిన నవీన్ యాదవ్ ఓ కేసు వివాదంలో డీఐజీకి అటాచ్ చేశారు. దీంతో సత్యనారాయణగౌడ్ భీమ్‌గల్ సీఐగా రానున్నారు.

డీఎంహెచ్‌వో పేరిట వసూళ్లు

- అనుమానం వచ్చి పట్టుకున్న ప్రయివేటు వైద్యులు
- పోలీసుల అదుపులో నిందితుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తి డీఎంహెచ్‌వో పేరిట ఆర్‌ఎంపీ, పీఎంపీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఘటన లింగంపేటలో వెలుగుచూసింది. వివరాలు ఇలా.. కామారెడ్డి ఏరియాలోని లింగాపూర్ పల్లె దవాఖానాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న బాలకృష్ణ శుక్రవారం లింగంపేట గ్రామంలోని ప్రయివేటు వైద్యుల వద్ద తాను మెడికల్ ఆఫీసర్‌నని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. మీపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదులు వచ్చాయి. సార్ వస్తే మీ ఆస్పత్రి సీజ్ అవుతుంది. నేను సార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని నమ్మ బలికాడు. దాంతో రషీద్ అనే ప్రయివేటు వైద్యుడు రూ. 15000 ఇచ్చాడు. అనంతరం ముబీన్ వద్దకు వెళ్లి రూ.10వేలు వసూలు చేశాడు.కొద్దిసేపటికి వారికి అనుమానం వచ్చి నిలదీయడంతో పొంతనలేని సమాధానమిచ్చాడు. దీంతో అతడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ప్రైవేటు వైద్యులు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. 15రోజుల క్రితం బాలకృష్ణ లింగంపేటకు చెందిన మల్లేషం అనే వైద్యుడి వద్ద రూ. 15వేలు తీసుకెళ్లినట్లు తెలిసింది.